# నిర్ణయం

గోపరాజు రాధాకృష్ణ

**శిథిల సంధ్యాగగనం రుధిరాన్ని కక్కుతోంది. డాబా మీద చాప వేసుకుని - ప్రాక్పశ్చిమాల నడుమ ప్రస్థానాన్ని ముగించి పడమటి కనుమల్లోకి అస్తమిస్తున్న సప్తాశ్వరథికుడు సృష్టించిన ఆ అందమైన దృశ్యాన్ని చూస్తూ కూర్చున్నాను.**

ఎవరో వస్తున్న అలికిడైతే వెనక్కి చూశాను. ఆరు నెలల పాపాయిని ఎత్తుకుని నా వైపు వస్తోంది నర్మద అక్కయ్య. "మధ్యాహ్నం వేళ ఎండలు మండిపోతున్నా సాయంత్రం కాస్త గాలేస్తుందిలే, నయమే" పాపాయిని చాపమీద పడుకోబెడుతూ అంది అక్కయ్య. నిద్ర పోతున్న పాపాయి ప్రక్కగా కూర్చుంది.

"ఏమిట్రా విశేషాలు? అన్నట్టు వాల్తేరులో ఎండలెలా వుంటాయి? అక్కడా కొండలే. మరీ వేడనుకుంటా..." సంభాషణలు ప్రారంభిస్తూ అంది అక్కయ్య.



ఆ ఉదయమే నేను వాల్తేరు నుంచి, అక్కయ్య ఇద్దరు పిల్లలతో హైదరాబాద్ నుంచి మా వూరు చేరుకున్నాం సందర్భం... చిన్నాన్నగారి పెద్దమ్మాయి పెళ్లి.

"మేం వుండే ప్రాంతం బాగానే వుంటుంది. ఇంతల్లా వుండవులే ఎండలు". ఊళ్లో పిలుపులకి వెడుతున్నారు కాబోలు వీధిలో బ్యాండు వాయించటం మొదలు పెట్టారు.

"ఏదీ... మీ పెద్దమ్మాయి కనిపించదేం?" పెద్ద కూతురు తరంగిణి కనిపించకపోవటంతో అడిగాను.

"అందరితో పిలుపులకి బయల్దేరింది... ఊ.. ఇంకేమిట్రా విశేషాలు ?" లేవబోయిన పాపాయిని జోకొడుతూ అడిగింది అక్కయ్య.

యూనివర్శిటీ జరిగే కార్యక్రమాలు... గర్వించదగ్గవి, తలొంచుకోవలసినవి, భయం గొలిపే సంఘటనలు... ఏవేవో... ఇలా !

మా ప్రశ్నోత్తరాయణం అంజమ్మ పిలుపుతో హఠాత్తుగా ముగించక తప్పలేదు. "ఏమ్మా! మద్దేలొచ్చినారంటగా. బావున్నారా?" మావైపు వస్తూ అంది అంజమ్మ.

మేం కూర్చున్న చాపకి కొంచెం ఆవలగా కూర్చోబోతూ చాపమీద ప్రశాంతంగా నిద్రపోతున్న పాపాయి ముఖంలో ముఖం పెట్టి చూస్తూ అంది అంజమ్మ "రెండో పాపగారేంటీవిడ? పుట్టినాకా ఇదే సూట్టం. మీ పెద్దమ్మ గారు (తరంగిణిని అంజమ్మ పెద్దమ్మ అని పిలుస్తుంది) అచ్చు ఆరి నాన్నగారి పోలిక. ఈవిడ మీ పోలిక" అనేసి చతికిలబడింది. "జాగ్రత్తమ్మా... పసిపిల్లల్తో. ఎండాకాలం మెలకువగ్గా సాకాల" దూరంగా బ్యాండు వినిపిస్తోంది.

అంజమ్మ మా ఇంట్లో పనిమనిషి కాదు. మామూలు రోజుల్లో కులవృత్తిలో భర్తకి సహకరిస్తూ, ఇలాంటి ప్రత్యేక సందర్భాల్లో అభిమానంతో

తనకు తానుగా వచ్చి ఆసరాగా వుండి తృణమో పణమో తీస్కెల్తుంది.

అక్కకి, అంజమ్మకి మధ్య లోకాభిరామాయణం ప్రారంభమైంది. లోకం పోకడ గురించి ఎక్కడలేని విషయాలూ నవరసాలకీ లోటు చేయకుండా చెబుతోంది అంజమ్మ. 'ఆహా... అలానా.. అదా సంగతి... ఓహో' అంటూ అక్కయ్య నన్ను పట్టించుకోవటం మానేసింది.

చాపమీంచి లేచి పిట్టగోడమీద కూర్చుని ఇద్దరినీ అబ్జర్వ్ చేస్తున్నాను.

"ఏమే మొన్నటిసారి వచ్చినప్పుడు నీ పెద్దకూతురికి నెలలని చెప్పావ్, ఆడా? మగా?" అక్కయ్య ప్రశ్నతో అప్పటి వరకూ నవ్వు ముఖంతో వున్న అంజమ్మ ముఖ కవళికలు మారిపోయాయి. "ఆడబిడ్డేనమ్మా" నిర్లిప్తంగా, నిస్తేజంగా జవాబిచ్చింది. కొంత తడవు నిశ్శబ్దం తాండవించిందక్కడ. మళ్లీ అంజమ్మే అంది.

"కానీ అది తల్లి కాపురం సెడగొట్టడానికే భూమ్మీదికొచ్చిందమ్మా"

"ఛ! అవేం మాటలే..." కించిత్ మందలింపుతో ఆశ్చర్యంగా అంది అక్కయ్య. "ఏం చెప్పేదమ్మా ! నిజమే... పసిగుడ్డు అదేం పాపం ఎరగదు" అంజమ్మ కంఠంలో బాధ ధ్వనించింది

"అసలేం జరిగిందే? తల్లీ పిల్లా బాగానే ఉన్నారుగా" ఆశ్చర్యంగా అడిగింది అక్కయ్య.

బాధని అదుపులో వుంచుకుంటూ ఆగి ఆగి చెప్పసాగింది అంజమ్మ తన కూతురి బాధాపరితప్తగాథ. "పెల్లయిన రెండేల్లకి గాని దాని కడుపు పండలేదమ్మా! రెండు సంవత్సరాల తర్వాత అది నీల్లోసుకున్నాదని కబురొచ్చినాది. నెలల్నిండినాకా మా కట్టుబాటు ప్రకారం తొలి కాన్పు మా ఇంటికాడే పొయ్యటానికి తీస్కొచ్చాం. తొలి కాన్పులో ఆడబిడ్డని కన్నాది. బిడ్డ ఎంత ముద్దుగున్నదో! మా ఆయన ఆ కబురు దాని పెనిమిటింటికెల్లి సెప్పొడమ్మా... ఒక్క పురుగూ రాలేదక్కన్నుంచి."

"ఎవరూ రాకపోవటమేమిటే? కనీసం దాని మొగుడైనా రావాలి కదా?" అక్కయ్య ఆశ్చర్యం.

"పన్రోజులు కదా అని సరిపెట్టుకున్నాం. తరోత రెండు నెల్లకి మా ఆయన దాన్ని దాని పెనిమిటింటికాడ ఇడిసిరాటానికి తీస్కెల్లాడమ్మా"

కాస్సేపు నిశ్శబ్దం. అంజమ్మ ముక్కు ఎగపీల్చింది. చిరు చీకట్లు కమ్ముకుంటున్నాయి.

"ఏ పాపం ఎరగం. కారనం ఏం సెప్పకుండా ఆ ఇంటి కోడల్ని - ఆ ఇంటి గుమ్మం తొక్కడం కుదర్దని తంటెమెట్టుకున్నారంట. మాటా లేదు, మంతీ లేదంటండి.... పొమ్మన్నారంట."

"రెండు సంవత్సరాలు కాపురం చేసి, బిడ్డనెత్తుకుని గుమ్మంలోకొచ్చిన కోడల్ని అలా అన్నారా.... ఏం కాలమొచ్చిందే?" బాధగా అంది అక్కయ్య.

"మా ఆయన బతిమాలాడంట. అచ్చుకోలేదంటాల్లు. ససేమిరా అన్నారంట సచ్చినోల్లు. ఊరు పెద్దలు నలుగురికీ సంగచ్చెప్పి కడిగించేశాడంట. గొడవకి బయపడి లోనకి రానిచ్చారమ్మా".

అక్కయ్య ముఖంలో కాస్త రిలీఫ్ గమనించాను- చిరుచీకట్లో. "ఇంతకీ దానిక్కారణం ఏమిటిటు? ఇంట్లోకి రానివ్వకుండా గుమ్మంలోంచే పొమ్మనేటంత తప్పు యిదేం చేసిందట.??" అక్కయ్య ప్రశ్న.

"ఆడపిల్లని కన్నందుకంటండి." అంజమ్మ మాటలకి షాక్ తిన్నాను. స్త్రీ శిశువును కన్నందుకు స్త్రీకి శిక్ష.

"ఇదెక్కడి దారుణమే" అక్కయ్య ఆశ్చర్యం. "ఊ తర్వాత"

"కొంపలోకైతే రానిచ్చారంటగానమ్మా దాని పేణానికి సుకం లేకుండా సేసే ఓరంట. మా అల్లుడి అన్నోకడున్నాడమ్మా ఆడు మడిసీ జన్మెత్తవల్సినోడు కాదమ్మా. రోజు ఆడు తాగొచ్చి అసలు నువ్వెందుకు ఆడ ముండని కన్నావ్ అంటూ నానా గొడవానంటండి."

"ఏం ఖర్మొచ్చిపడిందే దాని ప్రాణానికి. ఛఛ" అక్కయ్య స్పందన. "ఇంకా యినండి పోనీ ఆడు తాగుమోదెదవే. దానత్తగారూ అదే

## ఛాయాచిత్రం!

### "బూటు" తొడుక్కున్న గజరాజు!



ఈ ఫొటోలో వున్న గజరాజు ఫుట్‌బాల్ ఆడుకుంటున్నదనుకుంటున్నారు- కదూ! పొరబడ్డారు. ఆట కాదూ, పాడూ కాదు. 'బంది' అనే ఈ గజరాజుకి ఒక కాలు పొట్టి. ఒక కాలు పొడుగట. వాటి తేడా ఎనిమిది సెంటీ మీటర్లు వుండటంతో ఆ సైజుకు తగ్గట్టు బూటు తయారు చేయించుకుందట. అందుకే నేను తొడుక్కున్న బూటు చూడండంటూ కాలెత్తి చూపెడుతున్నట్లుంది ఫొటోలో. ఎరుపు, నీలం, తెలుపు బూట్లు తొడుక్కునే 'బంది' ప్రత్యేక సందర్భాలలో మాత్రం గులాబీ రంగు బూట్లు ధరిస్తుందట.

నడిచేటప్పుడు మాత్రం బూటు తొడుక్కున్న కాలే ముందుకు వేసి నడుస్తుందట ఈ 'బంది'. నేనూ ఆటల్లో పాల్గొంటానని మొరాయిస్తోంది కాబోలు యజమాని అంకుశం పెట్టి పొడుస్తున్నాడు!

వేలావసనంట. ఇంటిల్లపాదీ రోజూ కొట్టడమే నంట. పసిగుడ్డు దీంతో చెప్పి మరీ భూమ్మీదడ్డట్టు మాటాడేవోరంట"

'ఇంతలా హింసిస్తుంటే ఇంటికి తెలియచెప్పలేదా మీ అమ్మాయి' జాలిగా అంది అక్కయ్య.

"ఎట్టాగమ్మా. దానికి సదువురాదు."

"మరెలా తెలిసిందీ సంగతి మీకు."

"కడకి ఓ నాడు రాత్రికాడ పిల్లకాడ తల్లి లేకపోవటం చూసి మా అల్లుడి అన్నగాడు సచ్చినోడు... పసిగుడ్డు పీక పట్టుకొని నులిమెయ్యబోయాడంట. కేరమన్నాదంట ఆ పసి పేణం. కాని అదురుట్టసొత్తు మా అమ్మాయిని వచ్చి సూత్తే యిదంట ఆ పశువు చేత్తున్న పని... రేత్రికి రేత్రికి మా యింటికి వచ్చేసిందమ్మా. ఒకేల అక్కడున్నా పిల్లనీ, తల్లినీ కూడా సంపేత్తారు. భయంతో వచ్చేసిందమ్మా. వచ్చేటప్పటికి బిడ్డా, తల్లీ తోటకూరకాడల్లాగున్నారమ్మా. దాని పేనాలు కల్లల్లో ఉన్నాయి. దాన్ని సూత్తంటే కడుపు తరుక్కుపోయిందమ్మా. గుండె చెరువైపోయింది."

...అందుకే ఆడదై పుట్టేకంటే అడవిలో మానైపుట్టడం మేలని సామెత చెబుతారు.

నవనాగరీక సమాజంలో సమాధి కావలసిన సామెతే ! కాని నవనవోన్మేషంగా ఆ రోజు వినిపిస్తోంది. ఎవరు పలికినా అది వ్యవస్థలో ఉన్న వాస్తవానికి దర్పణం. ఈ నవ నాగరికత అంతాఈ భ్రమ అని చెప్పడానికి ప్రబల పరాకాష్ట. సాక్ష్యం ! గతం గతించ లేదనడానికి నికషోపలం.

"మళ్లీ దానిచేత కాపురం పెట్టించడానికి మీరేమైనా ప్రయత్నించారా?" ఆత్రంగా అడిగింది అక్కయ్య.

"చేసాం. జరిగిందేదో జరిగిపోయింది. దాన్ని ఏలుకోటానికి ఏంసెయ్యటానికైనా మేం సిద్ధం అని కబురంపాం. ఆ రోజే కోర్టు నుంచి కాయితాలొచ్చినయ్. అమ్మాయి నుంచి విడాకుల కోసం. మా అమ్మాయి లబోదిబోమన్నాది."

"ఎంతలో ఎంత మార్పే. ఆ !"

"మూడు మాసాలమ్మా - ఎండ నక, వాననక నేను, పసిగుడ్డుతో అది పని మానుకొని కోర్టుంట తిరిగాం. పనికెళ్లాపోతే పదేను రూపాయలు పోతాయ్. తీరా దాన్ని అత్తింటికి పంపితే అల్లు బతకనిత్తారనే నమ్మకం సచ్చిపోయింది. అయిన అల్లరెలాగా అయిందని మా ఆయన్ని రాజీకి పంపాను. ఆలక్కావల్సిందదేగదమ్మా - ఒప్పేసుకున్నారు. ఆ రోజు అందరూ కూకున్నాం. తప్పాలా, సెంబులసైతం మాకు తిరిగి యిచ్చేరు. అల్లుడు అన్నగాడన్న మాట గురుతుకొత్తుంటే...కాండ్రించి ఉమ్మాలనిపిస్తాదమ్మా. నలుగురు కూతుల్లున్నారుగా. పెద్ద కూతురు సత్తే ఏం అవ్వదులే అన్నాడంట. ఆదు మడిసి కాదనిపించిందమ్మా"

చీకటి చిక్కనైంది. వీధిలో చిన్నగా కలకలం. పిలుపులకి వెళ్లినవాళ్లు తిరిగొచ్చినట్టున్నారు.

అంజమ్మ అది విని సంభాషణ ముగిస్తున్నట్టుగా అంది " ఇప్పుడింటికాడే ఉన్నాదమ్మా. కూలి పని చేస్కుంటన్నాది. దాని బతుకలా తెల్లారిపోద్దేమో."

"అమ్మా ! వచ్చేసాం" తరంగిణి పరుగెత్తుకొస్తూ అంది . "పెద్దోరైపోయారు" అంజమ్మ ముఖకవళికలు మారాయి. 'నీళ్లుపొయ్యమ్మా' అంది తరంగిణి.

"నేను పోత్తాను రామ్మా" అని తరంగిణిని ఎత్తుకొని "నా కూతురు నాకు బరువు కాదమ్మా! మా యిల్లల్లో ఎవరి బతుకాల్లది. మొగోడయితే సరేసరి. ఆడదైతే ఏదో పని చేసుకు బతుకుతాది. దాని కాళ్లమీద అదినిలబడతాది. దాని పొట్టని అదే పోసించుకుంటాది."అంటూ మెట్లు దిగింది అంజమ్మ.

"ప్చ్. ఎలా ఉందో చూడరా ? లోకం ఎలా అయిపోయిందో" నన్నుద్దేశించి అంది అక్కయ్య చాపమీదున్న పాపాయిని ఎత్తుకుంటూ అక్కయ్య కూడా దిగిపోయింది. చాప ఎత్తి నేను కూడా దిగుతున్నాను.

...స్త్రీ ఉనికి యిప్పటికీ జవాబు దొరకని ప్రశ్నేనా ? ఆమె జీవితం విస్తరిస్తున్న విషవలయమేనా? "యత్రనార్యస్తు పూజ్యంతే"అన్న నానుడి చెదలు పడుతున్న పుస్తకాల్లో జీర్ణమైపోతోంది. సహగమనం నుంచి బైటపడ్డ స్త్రీ యిపుడు వరకట్న సమస్యతో సతమతమౌతోంది. ఆడ శిశువులు జన్మిస్తే తల్లి దొమ్ములకు విషం పూసి ప్రాణాలు తీస్తే - నదుల గర్భంలో ఉక్కిరిబిక్కిరిగా ముగిసిన ప్రాణాలు కొన్ని! స్త్రీ సమస్యల్లో మునిగితేలుతోంది. స్త్రీ పరంగా చరిత్రలో స్వర్ణయుగం ఎప్పుడో?! ...అంజమ్మ తన కూతురు గురించి తీస్కున్న నిర్ణయం నా చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది.- "అయినా మా యిల్లల్లో ఎవరికీ ఎవరూ బరువుకాదమ్మా. ఎవరి బతుకాల్లది. మొగోడైతే సరేసరి. నా కూతురు ఏదేనా పన్చేసుకు బతుకుతాది. దాని కాళ్లమీద అది నిలబడతాది. దానిపొట్ట అదే పోసించుకుంటాది..." తృప్తిగా మెట్లు దిగాను. ●

(అన్నయ్య గోపరాజు నారాయణరావుకి అంకితం-రచయిత)

### పులిట్జర్ బహుమతులు

**1989** సంవత్సరానికి పులిట్జర్ ఫిక్షన్ అవార్డు ప్రముఖ రచయిత్రి యాన్ టేలర్‌కు దక్కింది.

పత్రికా రచన, వ్యాఖ్యానం, సాహిత్య, సంగీత రంగాలలో అత్యుత్తమ కృషిసల్పిన వారికి ఈ బహుమతులను అందజేస్తారు.

కొలంబియా యూనివర్శిటీ అధికారులు, జర్నలిస్టుల బృందంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ పులిట్జర్ బహుమతుల రచనలను ఎంపిక చేసే సంఘం 1917లో ఏర్పాటైంది. ఈ ఏడాది అందిన రచనలలో అమెరికాకు సంబంధించిన గత, ప్రస్తుత సామాజిక అంశాలు ప్రధానంగా చోటు చేసుకున్నాయుట.

పులిట్జర్ సాహిత్య బహుమతి కీర్తి శేషుడు రిచర్డ్ ఎల్మన్‌కి (మరణానంతరం) లభించింది.

ఈ బహుమతులలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'ప్రజాసేవ' అవార్డును 'యాంకొరేజ్ డైలీ న్యూస్' పత్రికకు లభించింది.